క్లుప్తంగా

జోడులింగాలను దర్శించుకున్న విశ్వ


జోడు లింగాలను దర్శించుకుని బయటకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర స్వామిని మంగళవారం దర్శించుకున్నారు. శివ పార్వతు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ యువనేత వై. ప్రణయ్ రెడ్డి, ఆలయ ధర్మకర్త రామదుర్గం కిష్టప్ప, కమిటీ సభ్యుడు మెకానిక్ శంకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

ప్రజా తీర్పును శిరసావహిస్తా

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తానని పార్టీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి స్పందించారు. తనకు ఓట్లేసిన ప్రజలందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల పక్షాన ఉండి నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఎవరూ అధైర్య పడొద్దని విశ్వేశ్వర రెడ్డి తెలియజేశారు.

95 శాతం పింఛన్ పంపిణీ

కూడేరు: మండలంలో సామాజిక భద్రతా పింఛన్ల నగదు పంపిణీ మంగళవారం నాటికి 95 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు వెల్లడించారు. మండల వ్యాప్తంగా మొత్తం పింఛన్‌దారులు 5,708 మందికి గాను రూ.1.68 కోట్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. అందులో 1,756 మందికి ఇంటి వద్దకే వెళ్లి నగదును సచివాలయ సిబ్బంది అందజేశారు. మిగిలిన 3,952 మందికి వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసినట్లు చెప్పారు.

టీడీపీ, జనసేన కార్యకర్తల అత్యుత్సాహం

ఉరవకొండ: నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు టీడీపీ విజయం సాధించడంతో పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తూ, సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పట్టించుకోకుండా రెచ్చగొట్టే ధోరణిలో ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తొలగించి పెద్ద శబ్దాలు చేస్తూ, బైక్ ర్యాలీలు చేశారు. పోలీసులు అడ్డుకోకుండా చూస్తూ ఉండిపోయారు. గెలిచిన పార్టీ వారు విజయోత్సవ సంబరాలు, ర్యాలీలు నిర్వహించరాదని ఎన్నికల కమిషన్ స్పష్టంగా ప్రకటించినా, అవి పట్టించుకోలేదు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి


పూజలందుకున్న కాశీవిశ్వేశ్వరుడు

అనంతపురం కల్చరల్: జ్యేష్ఠమాస శివరాత్రి వేడుకలు మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మహాశివుడు ప్రత్యేక పూజలందుకున్నాడు. ఏకవార రుద్రాభిషేకం, భస్మార్చన, రుద్రం, చమకం పఠనం శాస్త్రోక్తంగా సాగాయి. విశేష పూజలనంతరం మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, శయనోత్సవ వేడుకలను అర్చకులు సంప్రదాయరీతిలో జరిపించారు. మాసశివరాత్రి రోజు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

హిందూ ధర్మప్రచారకుడు సంజీవరెడ్డి మృతి


సంజీవరెడ్డి (ఫైల్)

అనంతపురం కల్చరల్: హిందూ ధార్మిక కార్యక్రమాలకు జిల్లాలో పెద్ద దిక్కుగా ఉన్న చిన్నపరెడ్డి సంజీవరెడ్డి (75) మంగళవారం ఆకస్మికంగా మరణించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో కీలకంగా ఉన్న సంజీవరెడ్డి విశ్వహిందూపరిషత్తుతో పాటూ బీజేపీ నగర అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పని చేశారు. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో స్థానిక అశోక నగర్‌లోని హరిహర దేవాలయంలో భాగవతం చదువుతూ మరణించారు. సంజీవరెడ్డి మృతి హైందవ సంస్థలకు తీరని లోటని పలు సంస్థల ప్రతినిధులు తమ సంతాపం తెలియజేశారు. సంజీవరెడ్డికి ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానిక హరిశ్చంద్ర ఘాట్‌లో బుధవారం ఉదయం సంజీవరెడ్డి అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

జోరుగా వర్షం ..రైతుల హర్షం

- వజ్రకరూరులో భారీ వర్షం


కూడేరు : కలగళ్ల వద్ద చెక్‌డ్యాంలోకి చేరిన వర్షపు నీరు

వజ్రకరూరు: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. సాయంత్రం 4గంటలకు ప్రారంభమైన వర్షం గంటకుపైగా కురిసింది. భారీవర్షం కురవడంతో కాలనీల్లో వర్షపునీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. కాలనీలగుండా వచ్చే వర్షపునీరు మెయిన్‌రోడ్ మీదుగా చెట్టుకుంట వైపు ప్రవహించింది. వర్షాలు కురుస్తుండడంతో భూగర్భ జలాలు పెరగనున్నాయి. భారీవర్షం కురవడంతో వజ్రకరూరు పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ రావడంతో రైతులు వేరుశనగ పంటతోపాటు ఆముదం, కంది తదితర పంటలను సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి మంచి దిగుబడులు రావాలని రైతులు కోరుకుంటున్నారు.

కూడేరు: మండలంలో గత పది రోజులుగా వర్షం జోరుగా కురుస్తోంది. 50.4 మిల్లీ మీటర్లు, 40.2మిల్లీ మీటర్లు, 38 మిల్లీమీటర్లు చొప్పున పదునైన వర్షాలు కురిశాయి. వర్షం నీరు చెరువులు, చెక్‌డ్యాంల్లోకి, కుంటలు, ఫారంపాండ్లల్లోకి చేరుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీటి నిల్వలతో భూగర్భ జలాలు పెరిగి, వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బీడు భూముల్లో పచ్చి గడ్డి పడడంతో మూగజీవాలకు తాగునీరు, గ్రాసం దొరుకుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఆరంభం నుంచే వర్షాలు కురుస్తుండడంతో పంటల సాగుపై అన్నదాతల్లో ఆసక్తి పెరుగుతోంది. ఎక్కువ విస్తీర్ణంలో వేరుగనగ, కంది, ఇతర పంటల సాగుకు విత్తనాలను సిద్ధం చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. గతేడాది వర్షాభావంతో మండల వ్యాప్తంగా వేరుశనగ పంటను కేవలం ఐదు వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేసి నష్టపోయారు.


వజ్రకరూరులో భారీవర్షం కురుస్తున్న దృశ్యం


వజ్రకరూరులో కాలనీలో పారుతున్న వర్షపునీరు

దుర్గం ప్రజల శ్రేయస్సే ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి


మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: రాజకీయాల్లో గెలుపు,ఓటములు సహజమని, అంతమాత్రన కుంగిపోవాల్సిన అవసరం లేదు దుర్గం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని మెట్టు గోవిందరెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. ప్రజా శీస్సులను శిరసావహిస్తానన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. మంచిచేసిన ఈ ప్రభుత్వానికి ఊహించని ఫలితం దక్కడం కాస్త బాధేసిందన్నారు. దేశమే ఏపీ వైపు చూసేలా గడిచిన 59 నెలల కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన గొప్ప సేవలపై ప్రజలు ఎందుకు సంతృప్తి చెందలేదో విశ్లేషించుకుంటామన్నారు. అన్ని వర్గాలకూ మేలు చేకూర్చేలా మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకి దక్కిందన్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, తోడు, చేదోడు, పింఛన్లు, ఆర్‌బీకేల వద్దనే విత్తన కాయలు మొదలు, అన్ని సేవలూ అందించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో, తనతో కలిసి శ్రమించిన ప్రతి కార్యకర్త, నాయకుడు, ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. అందరం కలిసి ప్రజలకు మంచిచేసే విషయంలో ముందుందామన్నారు. ప్రజలకు ఏ నష్టం కలిగినా వారి తరపున గళం విప్పేందుకు వైఎస్సార్‌సీపీ వెన్నంటే ఉంటుందనే నమ్మకం కలగజేద్దామని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఓటమి పట్ల ఏ ఒక్కరూ కుంగిపోవద్దని ధైర్యం చెప్పారు.

ఎస్పీ బాలు సేవలు చిరస్మరణీయం


పాటలు పాడుతున్న గాయకులు

అనంతపురం కల్చరల్: తెలుగు సినీ సంగీత ప్రపంచంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వంటి గాయకుడు మళ్లీ పుట్టరని సీనియర్ గాయకుడు కేవీ మహీధర్ అన్నారు. స్థానిక రెండవ రోడ్డులోని మహతి లలిత సంగీత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం రాత్రి ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి జరిగింది. కేవీ మహీధర్‌తో పాటూ ఆంజనేయులు, రమారెడ్డి, ఉమాదేవి తదితరులు ఆ పాత మధుర గీతాలతో అందరిని అలరించారు. చినుకులా రాలె.. ప్రణయరాగ వాహిని.. గువ్వలా ఎగిరిపోవాలి వంటి మధురమైన పాటలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సినీ రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలుగు సినీ రంగానికి చేసిన సేవలను కొనియాడారు. అంతకు ముందు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఔత్సాహిక గాయనీ గాయకులకు మహతి పాఠశాలలో శిక్షణ ఇస్తామని తెలిపారు.

అభ్యర్థులకు పోలైన ఓట్లు

ఉరవకొండ: ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గం (149) నుంచి సార్వత్రిక ఎన్నికల బరిలో 11 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,24,339 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,94,544 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 22 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇందులో బరిలో నిలిచిన 11 మంది అభ్యర్థులు చివరి రౌండ్ వరకు పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

అభ్యర్థిపేరు	పార్టీపేరు	పోలైన ఓట్లు
1.అంకే తిప్పేస్వామి	బహుజన్ సమాజ్ పార్టీ	3,832
2.పయ్యావుల కేశవ్	తెలుగుదేశం	102046
3.వై.మధుసూదన్‌రెడ్డి	కాంగ్రెస్	4,529
4.వై.విశ్వేశ్వరరెడ్డి	వైఎస్సార్‌సీపీ	80,342
5.కురుబ చిన్నక్క	ఆలిండియా కిసాన్ జనతా పార్టీ	355
6.బి.పవన్‌కుమార్	భారతీయ చైతన్య యువజనపార్టీ	158
7.రామాంజనేయులు	జైభారత్ నేషనల్ పార్టీ	177
8. మోహన్‌దాస్	ఇండిపెండెంట్	178
9.చంద్రశేఖర్‌రెడి	ఇండిపెండెంట్	293
10.దామోదర్‌రెడ్డి	ఇండిపెండెంట్	228

రాయదుర్గంలో టీడీపీ గెలుపు


ఆర్వో కరుణకుమారి నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో రాయదుర్గం ఎమ్మెల్యేగా కాలవ శ్రీనివాసులు గెలుపొందారు. మొత్తం 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. సమీప ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి పై టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు 41,659 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. నియోజకవర్గం లో 296 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. వాటి పరిధిలోని 2,64,352 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. గత నెల 13న జరిగిన పోలింగ్‌లో 2,27,248 మంది ఓటర్లు , 1,671 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. మంగళవారం అనంతపురం జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన 14 టేబుళ్లలో 22 రౌండ్లు లెక్కించారు. టీడీపీ అభ్యర్థి కాలవకు 1,29,307 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డికి 88,165 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి వడ్డే చిన్నప్పయ్య ఈ ఎన్నికల్లో 3,374 ఓట్లు సాధించారు.

పెరిగిన కొత్తిమీర ధర

రాయదుర్గంటౌన్: మటన్, చికెన్, ఇతర మసాలా కూరల్లో ఎవర్‌గ్రీన్‌గా చెప్పుకునే కొత్తిమీర ధర అమాంతం పెరిగింది. కొత్తిమీర కట్ట రూ.20 ధర పలుకుతోంది. వారం రోజుల క్రితం వరకు రూ.10కు రెండు లేదా మూడు కొత్తిమీర కట్టలు వచ్చేవి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట దెబ్బతినడం, ఉత్పత్తి తగ్గడం, ఇతర ప్రాంతాల నుంచి సరఫరా చేసుకోవాల్సి వస్తుండడంతో ఒక్కసారిగా ధర పెరిగింది. దీంతో కొత్తిమీర కొనాలంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలు జంకుతున్నారు. మరోవైపు ఇతర కూరగాయల ధరలు కూడా ఏదీ కొన్నా కిలో రూ.50కి పైగా పలుకుతోంది.


బైక్ బోల్తా.. ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో మంగళవారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రామచంద్ర అనే వ్యక్తి గాయపడ్డాడు. జడ్ వీరారెడ్డి కాలనీకి చెందిన ఆయన బైక్‌లో గుంతకల్లు రోడ్డు బ్రిడ్జి వద్దకు బైక్‌లో వెళ్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలి

పావగడ: ఆరోగ్యం, ఆరోగ్యకర జీవనంతో పాటు భావితరాలను రక్షించడం కోసం పొగాకు రహిత సమాజాన్ని అందరూ కలసికట్టుగా నిర్మించాలని స్థానిక శ్రీక్షేత్ర ధర్మస్థలం గ్రామాభివృద్ధి సంఘం తాలూకా యోజనాధికారి మహేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ఎస్‌కే రంగ మందిరంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం, సంఘ సంస్థలు దేశ వ్యాప్తంగా పొగాకు నిర్మూలనకు వివిధ అభియాన కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. విద్యార్థులు అవగాహన కలిగి ఉండటంతో పాటు ఇతరులకూ తెలియజేశారని చెప్పారు.

నాగదేవతలకు ప్రత్యేక పూజలు


నాగదేవతలకు పూజలు చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామేశ్వరశర్మ, చంద్రాశర్మ, అనిల్ తదితరులు నాగులకట్ట వద్ద నాగదేవతలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పంచలింగ సహిత నాగదేవత విగ్రహాన్ని శోభాయానంగా అలంకరించారు. భక్తులు భక్తిప్రపత్తులతో నాగదేవతలను పూజించారు. సుబ్రహ్మణ్యం స్వామికి అర్చన, నివేదన గావించారు. మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉరవకొండలో పయ్యావుల కేశవ్ విజయం


ఉరవకొండ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం


పయ్యావుల కేశవ్‌కు డిక్లరేషన్ ఫాం అందిస్తున్న రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అనంతపురంలోని జేఎన్‌టీయూలో ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గం (149) ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఏఈఆర్‌ఓ శిరీషల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ప్రారంభించగా, ఇందులో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్‌కు 1,496 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వేశ్వర రెడ్డికి 596 ఓట్లు పడ్డాయి. పోస్టల్ బ్యాలెట్‌లో కేశవ్‌కు 900 ఓట్ల మెజార్టీ వచ్చింది. అనంతరం ప్రారంభమైన ఈవీఎం ఓట్ల కౌంటింగ్‌లో ప్రతి రౌండ్‌లో టీడీపీ అభ్యర్థి కేశవ్ ఆధిక్యత సాధించారు. మొత్తం 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరిగింది. ఉరవకొండ టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ గతంలో ఎన్నడూలేని విధంగా 21 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. పయ్యావుల కేశవ్‌కు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జేసీ కేతన్‌గార్గ్ డిక్లరేషన్ ఫాం అందించారు.

రౌండ్ సంఖ్య	టీడీపీ ఓట్లు	వైఎస్సార్‌సీపీ ఓట్లు	మెజార్టీ
1	6,878	5,796	1,082
2	6,878	5,781	1,097
3	13,232	11,577	1,655
4	26,884	23,227	3,657
5	32,863	29,353	3,510
6	39,596	34,493	5,103
7	46,303	39,638	6,665
8	52,503	44,915	7,588
9	59,943	50,479	9,464
10	67,044	54,838	12,206
11	74,287	60,120	14,127
12	81,855	65,103	16,752
13	89,010	71,152	17,858
14	96,348	76,816	19,532
15	1,00,550	79,746	20,804

కళ్యాణదుర్గంలో కూటమి గెలుపు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో ఈ సారి ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు గెలుపొందారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో సమీప ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ తరపున బరిలో ఉన్న తలారి రంగయ్యపై 37,734 ఓట్ల మెజార్టీతో అమిలినేని సురేంద్ర బాబు గెలుపొందారు. జరిగిన ఎన్నికల ఫలితాల్లో టీడీపీ కూటమి అభ్యర్థి సురేంద్రబాబు 1,18,878 ఓట్లు సంపాదించగా, సమీప వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తలారి రంగయ్య 81,144 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో ఉన్న రాంభూపాల్ రెడ్డి 2,585 ఓట్లు సాధించి, కనీస డిపాజిట్లు కూడా దక్కించుకోలేదు. బీఎస్పీ తరపున బరిలో ఉన్న హెచ్ నాగమ్మకు 440, జై భారత్ నేషనల్ పార్టీ పీఎం లక్ష్మణమూర్తికి 135, జై భీం రావ్ భారత్ పార్టీ హెచ్ వెంకటేశులుకు 135, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ బంగారు గిరిప్రసాద్ రెడ్డికి 120, స్వతంత్ర అభ్యర్థులైన శ్రీరంగరాజు గోపీనాథ్‌కు 247, రమేష్‌కు 137, బలిజ లక్ష్మీనారాయణకు 110, కురబ ముక్కన్నకు 100, నేనావత్ బలరాం నాయక్‌కు 98, మీనుగ అశోక్‌కు 97, టి.విశ్వనాథ్‌కు 84, జి.సురేష్‌కు 81 ఓట్లు చొప్పున పోలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులందరి కంటే నోటా (చెల్లని ఓట్లు)కు 1,450 ఓట్లు పోలవడం కొసమెరుపు.

ఉత్తర కర్ణాటకలో నువ్వా..నేనా.?

- హోరాహోరీగా తలపడిన కాంగ్రెస్, బీజేపీ
- కాంగ్రెస్ 7, బీజేపీ 6 చోట్ల విజయపతాక

సాక్షి,బళ్లారి: ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర కర్ణాటక పరిధిలోని పలు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నువ్వా, నేనా అన్న విధంగా హోరాహోరీగా తలపడి ఎన్నికల ఫలితాలు దక్కించుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఐదు గ్యారెంటీలతో ఎక్కువ సీట్లు గెలుపొందాలని ఆశలు పెట్టుకున్నప్పటికీ, బీజేపీ గాలికి తట్టుకోలేకపోయింది. ఐదు గ్యారెంటీలతో కాంగ్రెస్, మోదీ హవాతో బీజేపీ ప్రచారం చేసింది. కర్ణాటకలో పలు లోక్‌సభ స్థానాల్లో మోదీ గాలి పని చేసిందని చెప్పవచ్చు. ఉత్తర కర్ణాటక పరిధిలోని కొప్పళ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ బసవరాజ్ హిట్నాల్ తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి బసవరాజ్ క్యావటర్‌పై 46,300 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బాగల్‌కోటె లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి పీ.సీ. గద్దిగౌడర్ తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థిపై 64,400 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బెళగావి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి జగదీష్ శెట్టర్ తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి మృణాళ్ రవీంద్ర హెబ్బాళ్కర్‌పై 1,78,437 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. బళ్లారి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి శ్రీరాములుపై 98,992 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. బీదర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సాగర్ ఖండ్రే తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి భగవంత్ ఖూబాపై 1,28,000 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కలబురిగి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రాధాకృష్ణ దొడ్డమని తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి డాక్టర్ ఉమేష్ జాధవ్‌పై 27,200 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. చిక్కోడి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక జారకిహోళి తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థిపై 90 వేల ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. చిత్రదుర్గం లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి గోవింద కారజోళ తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థిపై 48,121 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దావణగెరె లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ప్రభా మల్లికార్జున తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి గాయత్రీ సిద్దేశ్వర్‌పై 26 వేల మెజార్టీతో గెలుపొందారు. ధార్వాడ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి ప్రహ్లాద్ జోషి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి వినోద్ అసూటికర్‌పై 97 వేల మెజార్టీతో గెలుపొందారు. విజయపుర లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి రమేష్ జిగజినగి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌ఆర్ అలగూరు(రాజు)పై 77వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. హావేరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి బసవరాజ్ బొమ్మై తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి అనాథస్వామిపై 43 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాయచూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కుమార్ నాయక్ తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి రాజా అమరేశ్వర్ నాయక్‌పై 80 వేల ఓట్లు మెజార్టీతో గెలుపొందారు.


రాయదుర్గం పట్టణంలోని వినాయక సర్కిల్‌లో ఇలా..


అనంతపురం ప్రధాన రహదారి లక్ష్మీబజార్ సర్కిల్‌లో ఇలా..

రాయదుర్గంలో నిర్మానుష్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రహదారులు ఏపీ సార్వత్రిక ఎన్నికల ఫలితాల సందర్భంగా మంగళవారం నిర్మానుష్యంగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు అదే పరిస్థితి నెలకొంది. ప్రతి ఒక్కరూ ఇళ్లలో టీవీలు వద్ద ఎన్నికల ఫలితాలు వీక్షించారు. మరోవైపు కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్ ఉండడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, పర్యవేక్షించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9010470185, 9010223701